



PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:23 ఎడిటర్: రాపోలు లింగస్వామి 23 -09 -2026 బుధవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00


## ఆ వర్గాలను దృష్టిలో పెట్టుకునే సంక్షేమ పథకాల అమలు



హైదరాబాద్, సెప్టెంబర్ 22: దళితులు, ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సొంత తల్లిలా ప్రేమ చూపించిన ఇందిరమ్మను వారు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు.మంగళవారం సచివాలయంలో అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై కమిటీ సమా వేశంలో సీఎం మాట్లాడు తూ.25 లక్షల ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరా గాంధీది అని కొనియాడారు. ఆమె స్ఫూర్తితోనే ఈ ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వం ఈ వర్గాల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్లలో 31శాతం లబ్ధిదారులు దళితులే అని తెలిపారు.ఎస్టీలకు 17 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు.రాష్ట్రంలో 27.5లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 3 కోట్ల 48 లక్షల మందికి తెలంగాణలో సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. సన్న బియ్యంతో దళిత,గిరిజన వర్గాలకు మంచి భోజనం అందించగలుగుతున్నామని తెలిపారు. దళితులు గిరిజనులు,ఆదివాసీలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోంద న్నారు. బాధితులకు నష్టపరిహారాన్ని బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. చదువొక్కటే జీవితాలను మారుస్తుందని.. అట్టడుగు వర్గాలను చదువు వైపు నడిపించకపోతే సమస్య పరిష్కారం కాదన్నారు.'పిల్లల్ని చదువు వైపు, క్రీడలవైపు ప్రోత్సహించండి. రాజకీయాలకు అతీతంగా ఈ వర్గాల అభివృద్ధి చేసుకుందాం. ఈ ప్రభుత్వం మీది.. మీకోసం పనిచేస్తుంది' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## భారీ వర్షాలు.. అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు




హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని హైడ్రా, పోలీస్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.రోడ్లు, ప్రధాన జంక్షన్లలో నీరు నిలవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

## అక్రమాస్తుల కేసులో నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ అరెస్ట్

హైదరాబాద్,: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ ఎన్.లక్ష్మీభాస్కర్‌ను అవినీతి




నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు మంగళ వారం అరెస్ట్ చేశారు. కాసేపట్లో ఆయనను కోర్టులో హాజరుపరు స్తామని ఏసీబీ అధికారులు తెలి పారు. ఈ రోజు ఉదయం నుంచి హైదరాబాద్ ఎర్రగడ్డలోని లక్ష్మీభా స్కర్ నివాసంతో పాటు మరో 7 ప్రాంతాల్లో ఏక కాలంలో సోదాలు నిర్వహించామన్నారు. ఈ సంద ర్భంగా కూకట్‌పల్లి, మణికొండ, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో ఆయ నకు ఫ్లాట్లు ఉన్నట్లు గుర్తించారు.అలాగే యాదాద్రి, నందిగామ,శామీర్‌పేట్‌లో నాలుగు ఓపెన్ ప్లాట్లతోపాటు విశా ఖపట్నంలో 800 చదరపు గజాల ఓపెన్ ప్లాట్ గుర్తించా మని చెప్పారు.అలాగే బ్యాంకు ఖాతాల్లో రూ.41లక్షలు, పోస్టాఫీసులో రూ.12 లక్షలు డిపాజిట్ల రూపంలో ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఇక ప్రైవేట్ ఆర్థిక సంస్థల్లో రూ.35 లక్షలు, మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.29.55 లక్షలు పెట్టుబడులు పెట్టినట్లు కనుగొన్నామని ఏసీబీ అధి కారులు వివరించారు.దీంతో పాటు 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారమని ఏసీ బీ అధికారులు తెలిపారు. జా గ్వార్, ఆడీ,టాటా నెక్సాన్ సహా 3 కార్లు,రాయల్ ఎన్‌ఫీల్డ్, వెస్పా, యాక్టివా,యమహా వంటి నాలు గు ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు గుర్తించారమని అన్నారు. సుమా రు రూ.5 లక్షల విలువైన ఎల క్ట్రానిక్ గ్యాడ్జెట్లు ఉన్నాయని కూ డా చెప్పారు.ఈ సోదాల్లో స్వా ధీనం చేసుకున్న పత్రాల ప్రకా రం లక్ష్మీభాస్కర్ మొత్తం ఆస్తుల విలువ రూ.6.13కోట్లు ఉంటు ందని లెక్కించామని పేర్కొన్నారు. వివాదంలో ఉన్న ఓ ఫ్లాట్ కొనుగోలుకు రూ.1.30 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు తమ సోదాల్లో గుర్తించామని ఏసీబీ అధికారులు వెల్లడించారు. అలాగే తన సన్నిహితులకు రూ.1.33కోట్లు అప్పుగా లక్ష్మీభాస్కర్ ఇచ్చినట్లు గురి_ంచామన్నారు.ఆయన అదనపు ఆస్తులపై వెరిఫికేషన్ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు వివరించారు.

## జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం

ప్రతిష్ఠాత్మకమైన 72వ జాతీయ చలన చిత్ర అవార్డుల



ప్రదానోత్సవం గుజరాత్‌లో వైభవంగా జరిగింది. రాష్ట్రంలోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుజరాత్‌లో అవార్డు ప్రదానోత్సవం జరగడం ఇదే తొలిసారి. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పలువురు సినీకళాకారులు పురస్కారాలు అందుకున్నారు. ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి, బాలీవుడు నటుడు కార్తిక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు.చందూ ఛాపియన్ చిత్రానికి కార్తిక్ ఆర్యన్‌ను, భ్రమయుగం చిత్రానికి మమ్ముట్టిని ఈ అవార్డు వరించింది. కల్కీ 2898 ఏడీ ప్రజాదరణ పొందిన ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఉత్తమ చిత్రంగా ఆ ర్టికల్ 370 నిలిచింది.ఆ చిత్రంలో నటించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. అమరన్ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియసామి అవార్డును అందుకున్నారు. ఈసారి తెలుగు సినిమాలు కూడా సత్తా చాటాయి. 'కల్కి 2898'తో పాటు 'కమిటీ కుర్రోళ్లు', '35.. చిన్న కథ కాదు', 'పుష్క-2', 'లక్కీ భాస్కర్' సహా పలు చిత్రాలు వివిధ విభాగాల్లో మొత్తం 9 అవార్డులను సొంతం చేసుకున్నాయి.చలనచిత్ర అవార్డుల ప్రదాన కార్యక్రమం సాధారణంగా ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే. 1954 నుంచి ఈ వేదికగానే అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 1971లో ఓసారి మాత్రమే చెన్నైలో జరిగింది. ఇక కరోనా సమయంలో రెండేళ్ల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించలేదు.

## కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు..

హైదరాబాద్, సెప్టెంబర్ 22:




తెలంగాణలో కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.దసరాపండుగకు ముందే అర్హులైనలబ్ధిదారులకు కొత్త పెన్షన్లుఅందేలా చూడాలని సూచించారు.క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఈ మేరకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.ఒంటరి మహిళలు,వితంతువులకు పూర్తి స్థాయిలో పెన్షన్లు అందజేయాలని మంత్రి సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరానాటికి కొత్త పెన్షన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించా రు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటా మని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలం

హైదరాబాద్, సెప్టెంబర్ 22: బీఆర్ఎస్ హయాంలో రైతులకు 24గంటల నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చామని.. కాంగ్రెస్ ప్రభుత్వం 7 గంటల కన్నా ఎక్కువగా విద్యుత్‌ను సరఫరా చేయడంలేదని ఆ పార్టీ ముఖ్యనేత, ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు రేవంత్ ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు.4 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో కేవలం 400 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్‌కు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను నిర్వహించడం రాదని.. అందుకే రాష్ట్రంలో తగినంత విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదని హరీశ్ ధ్వజమెత్తారు. విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ ఆరోపించారు. విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉండి కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు. ఎన్టీపీసీ 800 మెగావాట్ల ప్లాంట్ ఇస్తామంటే కూడా ప్రభుత్వం నిరాకరించిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చే లో-వోల్టేజీ కరెంట్‌తో రైతుల మోటర్లు కాలిపోతున్నాయని హరీశ్ రావు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.




# సంపాదకీయం

## ఈ తలకిందుల చదువును సరిచేసేదెవరు?

రైతులకు ఏ ఎరువులు వాడాలో, ఏ పురుగుల మందు ఎంత మోతాదులో వెయ్యాలో చెప్పడానికి ప్రతి గ్రామంలోనూ నిపుణుల్ని నియమిస్తామన్నది ఇటీవల తెలంగాణ ప్రభుత్వం. ఆ నిపుణులకు ఏ ఆరు నెలలో శిక్షణ ఇచ్చి నియమిస్తారు. మరి ఈ నిపుణులకు ఆరు నెలల్లోఇవ్వగలిగిన పరిజ్ఞానాన్ని రైతులే పాఠశాల విద్యార్థులుగా ఉన్నప్పుడు, ఆ పదేళ్ల చదువులో ఎందుకు ఇవ్వలేకపోయారు? లోతైన క్లిష్టమైన థియరీ అంతా పాఠశాల, ఇంటర్ స్థాయిల్లో పెట్టి, నిత్య జీవితంలో అన్వయించుకోగల విద్యను మాత్రం పైస్థాయి కోర్సుల్లో బోధించే తలకిందులచదువు వల్ల ఏం ప్రయోజనం?మెకాలే విద్యావిధానాన్ని నిర్మూలించాలని అరవయ్యేళ్లుగా నినదిస్తున్నాం.కానీ ఎలా మార్చాలో,దాని స్థానంలో ఏం ప్రవేశపెట్టాలో ఎవరూ చెప్పడం లేదు. కౌమారంలోని పిల్లలు వందల సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకొనే దయనీయమైన, వికృతమైన వ్యవస్థను మాత్రం తయారుచేశాం.'చదువు అంటే ఒక ఆనందమైన అనుభూతి కదా! జ్ఞానార్జన ఒక గొప్ప జీవితానుభవం కదా' అని ప్రొఫెసర్ హరగోపాల్ రాశారు. చదువు అంటే ఒక ఆనందమైన అనుభూతి అని భావించే ఒక్క విద్యార్థినైనా మన తెలుగు రాష్ట్రాల్లో ఎవరైనా చూపించగలరా?పాఠశాల స్థాయి పిల్లల ఆనందాన్ని కబళించే ప్రధాన శత్రువు అధిక చదువు. ఒకటో తరగతి విద్యార్థికి మూడు భాషలు నేర్పాలన్న నిర్ణయం తీసుకున్నప్పుడే మన పాలకులకు విద్యావ్యవస్థపై ఎంత అవగాహన ఉన్నదో అర్థం అవుతుంది! ప్రపంచంలో ఎక్కడైనా ప్రాథమిక విద్యార్థులకు మాతృభాష మాత్రమే నేర్పుతారు. ఇతర భాషలు నేర్చుకోవాలనుకొనేవారు డిగ్రీ స్థాయిలో వారికి ఇష్టమైన భాషలు నేర్చుకుంటారు. ఒక భాషను నేర్చుకుంటున్నామంటే అందులో కనీసం మాట్లాడటం, రాయడం రావాలి కదా! ఇందులో ఎంతవరకు విజయం సాధించాం? ఒకటో తరగతి నుంచి డిగ్రీ రెండో సంవత్సరం వరకు ఇంగ్లీషును ఒక సబ్జెక్టుగా 14 సంవత్సరాలు చదివిస్తున్నాం, పరీక్షలు పెడుతున్నాం.అయినా ఆ భాషలో ఒక వాక్యం సొంతంగా రాయడం కానీ, మాట్లాడటం కానీ చేయలేకపోతున్నారు. మరి ఈ కాలాన్ని ఎందుకు వ్యర్థం చేసినట్లు?అసలు భాష నేర్చుకోవటంలోని ప్రాథమిక లక్ష్యమైన అభివ్యక్తీకరణ రానప్పుడు దాన్నెందుకు చదివిస్తున్నాం? తల్లిదండ్రులు ఇంగ్లీషు మీడియం పాఠశాలల వైపు ఆకర్షితులవటానికి ప్రధాన కారణం ఇంగ్లీషులో మాట్లాడగలగటమే కదా.ఆ పని తెలుగు మీడియంలో కూడా చేయగలిగితే, ఒకటో తరగతి నుంచే పరాయి భాషలో అర్థంఅయ్యి,అవ్వకుండా బట్టీలు పట్టే క్షోభ పిల్లలకు ఉండదు. హిందీ పరిస్థితి కూడా ఇంతే.పెద్దయిన తరు వాత నాలుగైదు నెలల్లో నేర్చుకోగలిగిన భాషను చిన్న పిల్లలకు పదేళ్ల పాటు బోధించి హింసించటమెందుకు?అసలు చిన్న పిల్లలకు మూడు భాషలు నేర్పడమేమిటి? వీటిలో రెండు భాషలు తగ్గినట్లయితే పిల్లలపై ఎంత బరువు తగ్గేదో ఆలోచించండి. దశాబ్దాల పాటు ప్రయోజనమేమీ కలగజేయని ఈ భాషా విధానాన్ని వెంటనే మార్చేయాలి.జీవశాస్త్రాన్ని హైస్కూలు నుంచి ఇంటర్ వరకు తీసుకుంటే ఇందులో ముఖ్యంగా జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం ఉంటాయి. జంతుశాస్త్రంలో వెన్నెముక గల జీవులు (కార్డేటా), వెన్నెముక లేని జీవులు, ఏకకణ జీవులు, బహుకణ జీవులు, ఇతర లక్షణాల ఆధారంగా వాటి వర్గీకరణ, ప్రోటోజోవా, పోరిఫెరా, ఆర్థోపొడా, ఎకైనోడెర్మేటా వంటి ఫైలాల నుంచి సబ్‌ఫైలాలు, వాటి కుటుంబాలు చివరికి ఆయా జాతుల వరకు వందలాది నామాలు,వాటి సాధారణ లక్షణాలు, బాక్టీరియా, వైరస్, జెనెటిక్స్, జెనెటిక్ కోడ్‌లు, కణాలు, వాటి నిర్మాణం, కణ విభజన, వివిధ వ్యవస్థల నిర్మాణం, పనితీరు... ఇలా ఉన్నతస్థాయి జీవశాస్త్రం అంతా చదివేస్తారు. ఇందులో ఏ జీవీ మనకు బయట కనిపించదు. మైక్రోస్కోపులో చూడాల్సిందే. జీవులను కానీ, అంతర్గత వ్యవస్థలను కానీ, కేవలం ఊహించుకోవలసి రావటం వల్ల అవి అర్థం కావు, నిత్యజీవితంలో ఉపయోగపడవు కాబట్టి ఆసక్తి కలగదు. క్లిష్టమైన లాటిన్ పేర్లు గుర్తుండవు.ఇవన్నీ బట్టీ పట్టి, ఇంత విశదంగా నేర్చుకుంటారు సరే..కానీ, ఇంటర్ చదివి వ్యవసాయం చేయదలుచుకున్న విద్యార్థికి పశువులను ఎలా పెంచాలో, వాటికి వచ్చే జబ్బులు ఏమిటో,అవి రాకుండా ఏమి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియదు. గేదెలకు ఏమి ఆహారంగా పెడితే ఎక్కువ పాలిస్తాయో, గొర్రెలను ఎలా కాపాడుకోవాలో, చేపలపెంపకం,పట్టు పురుగులు.ఏమీ తెలియదు. ఇవన్నీ వెటర్నరీ డాక్టరు కోర్సులో ఉంటాయి. మరి మనం పైన చెప్పుకున్న జంతుశాస్త్రమంతా దేనికొరకు చదివినట్లు?లోతైన, క్లిష్టమైన థియరీ అంతా పాఠశాల, ఇంటర్ స్థాయిలో పెట్టి, నిత్య జీవితంలో అన్వయించుకోగల (అప్లికేషన్) విద్యను మాత్రం పై కోర్సులో పెట్టారు. నిజానికి అప్లికేషన్ కింది స్థాయిలో బోధించినట్లయితే... రోజూ చూసే జీవుల విషయం కాబట్టి విద్యార్థులు ఆసక్తితో చదువుతారు. పదో తరగతిలో చదువు మానేసినా అప్పటి వరకూ చదివిన చదువు నిత్య జీవితంలో ఉపయోగపడుతుంది. ఆసక్తి ఉన్నవారు పై చదువులకు వెళ్లి లోతుగా చదువుకుంటారు. ఇక్కడ చదవవలసింది అక్కడ, అక్కడ చదవవలసింది ఇక్కడ! ఇదీ మన తలకిందుల చదువు.వృక్షశాస్త్రంలో కూడా ఇంతే. వరి ఎన్ని రోజుల పంటో, నారుమడి చల్లి... నాట్లు ఎందుకు వేస్తారో, వరికి వచ్చే రోగాలేమిటో, వాటిని ఎలా అరికట్టాలో ఎవ్వరికీ తెలియదు. ఇతర పంటలు, పండ్లు, పూలతోటల పెంపకం, అంట్లు కట్టడం వంటి నిజజీవితంలో ఎంతో ఉపయోగపడే విజ్ఞానం వారికి బోధపడదు. ఏ విధంగానూ ఉపయోగపడని కష్టతరమైన నాలెడ్జిని, ఎందుకు చదువుతున్నామో తెలియకుండా పంటి బిగువున రుబ్బి పరీక్షల్లో రాసి, తరువాత దానితో ఏ ఉపయోగంలేక మర్చిపోతున్నారు.ఫిజిక్స్, కెమిస్ట్రీలలో కూడా ఇంతే.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

**- శాంతియుతంగా నిమజ్జనం నిర్వహించాలి**

**- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా సురక్షితంగా



నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా సుమారు 1,000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలు జరిగే ప్రధాన మార్గాలు నిమజ్జన ప్రదేశాలు రద్దీ ప్రాంతాలు సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలం నిమజ్జనం ఘాట్ వద్ద పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఘాట్ పరిసరాల్లో పోలీస్ సిబ్బందిని అధిక సంఖ్యలో మోహరించి రద్దీ నియంత్రణ వాహనాల రాకపోకలు పార్కింగ్ శోభాయాత్రల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ వాహనాల మళ్లింపు పార్కింగ్ క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. శోభాయాత్రల్లో డీజేలు అధిక శబ్దాన్ని కలిగించే సౌండ్ సిస్టమ్స్ టపాసులకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని నిమజ్జన సమయంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు రెస్క్యూ సిబ్బంది అత్యవసర సేవల బృందాలు రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకరమైన నీటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో బ్లూకోట్స్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీస్ అగ్నిమాపక వైద్య రెవెన్యూ మున్సిపల్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు.గణేష్ మండపాల నిర్వాహకులు శోభాయాత్ర నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# భూ రీ-సర్వే పనులను వేగవంతం చేయండి

**- నెలన్నరలోగా పూర్తి చేయాలి**

**- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు**





భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):భూ రీ-సర్వే పనులను వేగవంతం చేసి నెలన్నరలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. కొత్తగూడెం మండలం రామవరం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుజాతనగర్ రామవరం గరీబ్ పేట ట్రైజంక్షన్ వద్ద జరుగుతున్న సర్వే పనులను పరిశీలించి సర్వే పురోగతి భూ హద్దుల నిర్ధారణ సర్వే నంబర్లు భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రామవరం రెవెన్యూ పరిధిలో సుమారు 1,950 ఎకరాల భూమికి రీ-సర్వే నిర్వహించాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే గ్రామ సరిహద్దుల నిర్ధారణ చేపట్టడంతో పాటు అటవీ భూముల హద్దులను కూడా పరిశీలించినట్లు తెలిపారు. సర్వే పరిధిలో సుమారు 146 ఎకరాల మేర అటవీ భూమి ఉన్నట్లు వివరించారు. సర్వే నంబర్లు 23, 30, 31 తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే నంబర్ 20లో పట్టా అసైన్‌మెంట్ అటవీ భూములు కలిసి ఉన్నందున ఆయా భూముల హద్దులను రికార్డుల ఆధారంగా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. అటవీ భూముల హద్దులు ఇప్పటికే నిర్ధారితంగా ఉన్న ప్రాంతాల్లో అనవసర జాప్యం లేకుండా మిగిలిన రీ-సర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.సర్వే పరిధిలో పోడు సాగు చేస్తున్న భూములు ఉన్నాయని అర్హులైన వారికి ఆర్ ఓ ఎఫ్ ఆర్ కింద హక్కులు కల్పించినట్లు అధికారులు వివరించారు. సుమారు 420 మందికి పైగా పట్టాదారులు ఉన్నారని ఇందులో గిరిజనులు ఇతర వర్గాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. రీ-సర్వే ద్వారా భూ హద్దులు స్పష్టమై హక్కుదారులకు ప్రయోజనం కలిగేలా రికార్డులను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ సూచించారు.సమ్మక్క గద్దె సమీప ప్రాంతం నుంచి సుమారు 2.3 నుంచి 2.5 కిలోమీటర్ల మేర సరిహద్దు సర్వే నిర్వహించినట్లు అధికారులు వివరించారు. అక్కడ ఉన్న పాత సరిహద్దు రాళ్లు మ్యాప్‌లు రికార్డులను పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ-సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతంగా చేపట్టి నెలన్నరలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించి భూ రికార్డుల్లో ఎలాంటి అయోమయానికి తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ పుల్లయ్య, సర్వేయర్ అశోక్, ఆర్ఐ గణపతి, లైసెన్సుడ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యలత సాయి నగర్ కాలనీ 27,616/- లడ్డు దక్కించుకున్న

**: పి. శ్రీనివాస్ గౌడ్ జయశ్రీ దంపతులు**

ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్



22:వనస్థలిపురం పరిధిలోని భాగ్యలత సాయి నగర్ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా కాలనీలో ఘనంగా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉత్కంఠభరితంగా సాగిన లడ్డు వేలం పాటలో కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయి నగర్ కాలనీకి చెందిన పి. శ్రీనివాస్ గౌడ్, జయశ్రీ దంపతులు రూ. 27,616 లకు గణపతి లడ్డును దక్కించుకున్నారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వారసిగూడలో ఘనంగా గణేష్ నవరాత్రి వేడుకలు..

**101 జ్యోతులతో మహిళల గోమాత పూజ**



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 22:వారసిగూడ గణేష్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రుల వేడుకలను పురస్కరించుకుని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో 101 జ్యోతులతో గోమాత పూజ ఘనంగా నిర్వహించారు. గోమాతను పూజించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో రేవతి, అంబిక, స్వాతి, సుజాత, సౌమ్య, అఖిల, అనుష, అర్చన, భావన, వామిక తదితర మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

# వినాయక మండపాలను సందర్శించిన మాజీ కార్పొరేటర్

**సింగరేణి కాలనీలో అన్నదాన ప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్న సామ స్వప్న సుందర్‌రెడి**

సైదాబాద్, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి,సెప్టెంబర్ 22: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వివిధ వినాయక మండపాలను మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా



కార్యక్రమాల్లో పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారు.అనంతరం స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన అన్నదాన ప్రసాదం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, ప్రజలంతా ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.ఈ



కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చికిత్సకు సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఎల్ఓసీ

### పేదలకు అండగా ఉంటాం

ఎల్బీనగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 22: బీఎన్రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహినగర్కు చెందిన కృష్ణప్రసాద్ ఊపిరితిత్తులకు సంబంధించిన పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్రెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఎమ్మెల్యే చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా దరఖాస్తు చేయించారు.దీంతో కృష్ణప్రసాద్ చికిత్స కోసం రూ.2 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరైంది. మంజూరైన చెక్కును బాధితుడి భార్య నీరజకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా సుధీర్రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం తనకు ఎంతో సంతృప్తినిస్తుందని తెలిపారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు సహాయం చేసే అవకాశం లభించిందన్నారు. అవసరమైన వారికి తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు.బాధితుడి భార్య నీరజ మాట్లాడుతూ తమ భర్త ఆరోగ్య



సమస్యను తెలుసుకున్న వెంటనే సుధీర్రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి అందించిన సహాయాన్ని జీవితాంతం మరువలేమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కర్మన్ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త మధుసాగర్ పాల్గొన్నారు.

# బంజారా కాలనీలో హిందూ స్మశాన వాటిక పనుల పరిశీలన

### అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్రెడ్డి

హయత్నగర్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 22:హయత్నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీలో హిందూ స్మశాన వాటికలో చేపట్టిన అభివృద్ధి పనులను మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన హయాంలో మంజూరైన దాదాపు రూ.6 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు.స్మశాన వాటికలో చేపట్టిన నిర్మాణ పనులు, నాణ్యత, మౌలిక వసతులను అధికారులతో కలిసి పరిశీలించిన నవజీవన్రెడ్డి.. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తయ్యేలా చూడాలని అధికారులతో చర్చించారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్రెడ్డి తెలిపారు.ఈ



కార్యక్రమంలో యూబీడీ మల్కాజ్గిరి మేనేజర్ సునంద, డైరెక్టర్ లోకేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షంతో హైదరాబాద్లో ట్రాఫిక్ నెమ్మదింపు

### ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం.. అప్రమత్తంగా ఉండాలని సూచన

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 22:నగరాన్ని వర్షం ముంచెత్తడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రాకపోకలు మందగించాయి. మరో గంట నుంచి గంటన్నర వరకు వర్షం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూచించిన నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భారీగా వర్షం కురుస్తుండటంతో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో రోడ్లు జారుడుగా మారి ప్రమాదాల అవకాశాలు పెరగడంతో ద్విచక్ర వాహనదారులు వేగాన్ని తగ్గించి ప్రయాణిస్తున్నారు. ఫలితంగా పలు ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలు నెమ్మదిగా సాగుతున్నాయి.ముఖ్యంగా అమీర్పేట, పంజాగుట్ట, లక్ష్మీకాపూల్, కోటి, చాదర్ఘాట్ నుంచి మలక్పేట వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. వర్షం తగ్గిన వెంటనే సిగ్నళ్ల వద్ద వాహనాలు, ప్రజలు ఒక్కసారిగా పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో రద్దీ మరింతగా కనిపిస్తోంది.అదేవిధంగా సికింద్రాబాద్, ఉప్పల్ వైపు కూడా కొన్ని ప్రధాన ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనాల రద్దీ కొనసాగుతోంది. ట్రాఫిక్ పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు.వర్షం కొనసాగుతున్న నేపథ్యంలో వాహనదారులు అత్యవసరమైతేనే ప్రయాణించాలని, ద్విచక్ర వాహనదారులు వేగాన్ని నియంత్రించి ముందున్న వాహనానికి తగినంత దూరం పాటించాలని అధికారులు సూచించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ప్రయాణించాలని కోరారు.

# ఉప్పదనమే స్వేచ్ఛ

సముద్రం నీళ్లు తియ్యగా ఉంటే
మనుషులు వాటిని సీసాల్లో నింపుకునేవారు
తమ దాహానికి ధర కట్టితీరాలన్నింటి
నీ వ్యాపారంగా మార్చేవారు
కానీ సముద్రం ఉప్పుగా ఉంది
అందుకే అది ఎవరి సొత్తు కాలేదు
ఎవరి గ్లాసులో ఇమడలేదు
ఎవరి గోదాములో నిల్వ కాలేదు
దాని ఉప్పదనందాని మీద వేసిన ముద్ర కాదు
ప్రపంచం తనను సొంతం చేసుకోకుండా
ప్రకృతి ఇచ్చిన స్వేచ్ఛా తాళంకొన్ని లోపాలే
మనిషిని బానిసత్వం నుంచి కాపాడతాయి
కొన్ని చేదు నిజాలే
జీవితాన్ని అమ్ముడు
పోకుండా నిలబెడతాయి
అందంగా లేనిదని బాధపడకు
అందరూ కోరుకోనిదే
ఎప్పుడో ఒకరోజునీ స్వేచ్ఛకు గోడగా మారవచ్చు
ప్రతి తియ్యదనం వరం కాదు
ప్రతి చేదుతనం శాపం కాదు
కొన్ని ఉప్పు కన్నీళ్లేమన ఆత్మకు సముద్రం అవుతాయి
అందుకే నీలోని ఉప్పదనాన్ని ద్వేషించకు



అదే నిన్ను ఎవరి సీసాలోనూ ఇమడనివ్వదు.

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# మిషన్ భగీరథ కార్మికులు సీఐటీయూలో చేరిక

### కనీస వేతనం రూ.28 వేలు ఇవ్వాలి

లింగోటం, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 22: మిషన్ భగీరథలో



పనిచేస్తున్న పలువురు కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారని తెలిపారు. కనీస వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం రూ.28 వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలతో పిల్లల చదువులు, కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు.కెవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ కార్మికుల హాజరును నమోదు చేసే స్కానింగ్ లొకేషన్ సిస్టమ్లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. కొన్ని సందర్భాల్లో సిగ్నల్ సరిగా లేకపోవడంతో హాజరు నమోదు కాక, నెలలో రెండు రోజుల వేతనాన్ని కోల్పోవాల్సి వస్తోందని తెలిపారు. ఈ విధానాన్ని సరిచేసి కార్మికులకు పూర్తి నెల హాజరు నమోదు చేసి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రమాదవశాత్తు కార్మికులకు ఏదైనా జరిగితే ప్రస్తుతం ప్రమాద బీమా సౌకర్యం లేకపోవడం ఆందోళనకరమని, వెంటనే మిషన్ భగీరథ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని నాగార్జున కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తూ వారికి అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సీఐటీయూ నాంపల్లి, మర్రిగూడ మండల కన్వీనర్లు ఏదుళ్ల సునీత, ఏర్పుల పద్మ, మిషన్ భగీరథ కార్మికులు గ్యారకాశయ్య, రామావత్ మోతీనాయక్, దండిగా మల్లేష్, జారా యాదయ్య, సుంకర యాదయ్య, బుష్పాక యాదగిరి, పూల శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మధురానగర్లో గణనాథుని దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్రెడ్డి

మన్సురాబాద్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 22:గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడిని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గణనాథుడికి పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడి ఏర్పాట్లను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్రెడ్డి, ఉత్సవ నిర్వాహకులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



శ్రీశైలం, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 22:పద్మశాలి సత్ర సముదాయ ట్రస్ట్ భవన్లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సత్ర సముదాయ ట్రస్ట్ కన్వీనర్ వర్కాల సూర్యనారాయణతో పాటు ట్రస్ట్ సభ్యులు, పద్మశాలి సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను స్మరించుకున్నారు.

# ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఆరోగ్య అవగాహన కార్యక్రమం

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 22:ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ, విజయనగర్ కాలనీ నాంపల్లి, హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ






ఉన్నత పాఠశాల, గోషామహల్లో యోగా వాక్, యోగా శిక్షణా కార్యక్రమం, ఆరోగ్య అవగాహన శిబిరం నిర్వహించబడింది.ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 23వ తేదీన ధన్వంతరి జయంతిని ఆయుర్వేద దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా 21-09-2026 నుండి 23-09-2026 వరకు వివిధ ఆరోగ్య అవగాహన శిబిరాలు, యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాల ద్వారా యోగా, ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యాధుల నివారణ, ఆరోగ్య పరిరక్షణ గురించి ప్రజలకు మరియు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే హోమియోపతి వైద్యం, దాని ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించి, అవసరమైన వారికి హోమియోపతి చికిత్స అందించారు.ఈ కార్యక్రమంలోడా. సునీత ఎన్ సి ఎన్ రాములు,నూక తొట్టి.నవీన్(యోగ



శిక్షకుడు)పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో యోగా, ఆరోగ్యకరమైన జీవన విధానం, శారీరక చురుకుదనం మరియు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు.

# కర్మన్‌ఘాట్‌లో గణపతి లడ్డూలకు భారీ డిమాండ్

### రెండు లడ్డూల వేలంతో రూ.4.82 లక్షల ఆదాయం

రంగారెడ్డి జిల్లా జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 22: హైదరాబాద్‌లోని ప్రసిద్ధ కర్మన్‌ఘాట్ శ్రీ హనుమాన్ దేవస్థానంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్వామివారి లడ్డూ ప్రసాదాల వేలంపాట ఉత్సాహంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఎన్.





లావణ్య సమక్షంలో నిర్వహించిన వేలంలో భక్తులు ఆసక్తిగా పాల్గొన్నారు.శ్రీ గణపతి ఆలయంలోని స్వామివారి లడ్డూను ఆలయ మాజీ ధర్మకర్త బండార్ శ్రీనివాసరెడ్డి?రజిత దంపతులు రూ.1,97,899కు వేలంలో దక్కించుకున్నారు. వ్రత మండపంలోని శ్రీ విజయ వినాయక స్వామివారి లడ్డూను మండప అలంకరణ దాత కొప్పునూర్ శివకుమార్?మీనా దంపతులు రూ.2,85,000కు సొంతం చేసుకున్నారు. రెండు లడ్డూల ద్వారా మొత్తం రూ.4,82,899 ఆదాయం సమకూరింది.గత ఏడాదితో పోలిస్తే గణపతి ఆలయంలోని లడ్డూ ధర ఈసారి గణనీయంగా పెరిగింది. గత ఏడాది రూ.1,80,000 పలికిన లడ్డూ ఈసారి రూ.1,97,899కు చేరి రూ.17,899 అధిక ధర పలికింది. అలాగే వ్రత మండపంలోని విజయ వినాయక స్వామివారి లడ్డూ గత ఏడాది రూ.2,80,000 పలకగా, ఈసారి రూ.2,85,000కు విక్రయమైంది.స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని వేలంలో దక్కించుకునేందుకు భక్తులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా ఆలయ మాజీ ధర్మకర్తలు ఏ. రవీందర్‌రెడ్డి, కె. సంతోష్, నాగరాజు, యాదిరెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వినాయకుడి వద్ద ఘనంగా అన్నదానం

### భక్తులకు అన్నదాన ప్రసాదం అందించిన నిర్వాహకులు

జ్యోతి ప్రభంజనం,గోషామహల్,ప్రతినిధి, సెప్టెంబర్ 22:వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని దేవి నగర్‌లోని జుమ్మేరత్ బజార్, ఉప్పలమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని అందించారు.వినాయకుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సేవాభావాన్ని చాటుకున్నారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో దత్తా, ఓం సింగ్, చైనా, శివ, బబ్లూ, చింటూ, దాస్, లోకేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. స్థానిక భక్తులు, యువకులు, కాలనీ ప్రజలు పాల్గొని నిర్వాహకులను



అభినందించారు.

# డెకరేషన్ గోడౌన్‌లో నేపాల్ యువకుడి మృతి

### మూసానగర్‌లో విషాద ఘటన.. ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి

మలక్ పేట్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 22: చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసానగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. డెకరేషన్ వర్క్స్ గోడౌన్‌లో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన 28 ఏళ్ల యువకుడు కిషోర్ మృతి చెందాడు. గోడౌన్‌లోని డెకరేషన్ వస్త్రానికి వేలాడుతూ కనిపించిన అతడిని తోటి కార్మికులు వెంటనే కిందకు దించి ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రాణాలు దక్కలేదు.పోలీసుల వివరాల ప్రకారం.. కిషోర్ గత మూడేళ్లుగా అదే డెకరేషన్ వర్క్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గోడౌన్ ప్రాంగణంలోనే నివాసం ఉంటున్నాడు. సెప్టెంబర్ 22న తెల్లవారుజామున సుమారు 1:30 గంటల సమయంలో బాలానగర్‌లోని సూరారం నుంచి గోడౌన్‌కు తిరిగి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.ఉదయం సుమారు 6:30 గంటల సమయంలో కిషోర్ గోడౌన్‌లో వేలాడుతూ కనిపించడంతో అక్కడున్న కార్మికులు వెంటనే స్పందించారు.అతడిని కిందకు దించి పరిశీలించగా నాడి ఉన్నట్లు గుర్తించి హుటాహుటిన ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు.అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.సమాచారం అందుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.ఈ ఘటనపై క్రైం నంబర్ 370/2026, సెక్షన్ 194 కింద కేసు నమోదు చేశారు.



యువకుడి మృతికి దారితీసిన పరిస్థితులు ఏమిటన్నది తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనకు సంబంధించిన ఇతర వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# చంపాపేట్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం



చంపాపేట్, జ్యోతి ప్రభంజనం: చంపాపేట్‌లోని మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌వద్ద బాలాజీ నాయక్ మాస్టర్ ఆధ్వర్యంలోని సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్,కరాటే యూనిట్‌లో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలుఅందుకున్న శ్రీ వినాయకుడి విగ్రహాన్ని మంగళవారం ఘనంగా నిమజ్జనం చేశారు.తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వినాయక విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తి పాటలతో యువత, చిన్నారులునృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.దీంతో పరిసర ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.అనంతరం అంగరంగ వైభవంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికిబంజారాభారత్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎన్.సీతారాం నాయక్, జనసేన పార్టీ యాకుత్‌పురా ఇన్‌చార్జి హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు.వారితో పాటు నాగరాజు మాస్టర్,కరాటే విద్యా ర్థులు, చిన్నారులతల్లిదండ్రులు,నిర్వాహకులుతదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు

చౌటుప్పల్, సెప్టెంబర్ 22 చౌటుప్పల్ పట్టణంలోని తంగడపల్లి రోడ్డులో లయన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవా ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత బీపీ, షుగర్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు.సేవా కార్యక్రమంలోభాగంగా నిర్వ హించిన ఈ శిబిరంలో గ్రామ ప్రజలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని,బీపీ,షుగర్ వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం. జె. ఎఫ్. లయన్ ఉప్పు ఆంజనేయులు (జోన్ చైర్‌పర్సన్), అధ్యక్షులు ఎం. జె. ఎఫ్. లయన్ ఎం.డి. అతహార్ పాషా, ఎం. జె. ఎఫ్. లయన్ డాక్టర్ వేముల నరసింహ, ఎం. జె. ఎఫ్. లయన్ డాక్టర్ కాసుల వెంకటేశం గౌడ్, ఎం. జె. ఎఫ్. లయన్ తిరందాసు జగన్నాథ్, సెక్రటరీ ఎం. జె. ఎఫ్. లయన్ దాచేపల్లి రాజు, ఎం. జె. ఎఫ్. లయన్ సిలువేరు మంగయ్య,



ఎం. జె. ఎఫ్. లయన్ గోపగోని లక్ష్మణ్ తదితర లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలకు నిర్వాహకులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# అంగన్వాడి చిన్నారులకు పలకలు, బలపాలు పంపిణీ

### ఎస్ ఎస్ సి 2007 పూర్వ విద్యార్థుల చేయూత

గార్ల మండల పరిధి ఏడు అంగన్వాడీ కేంద్రాలలో అభ్యసించే చిన్నారులకు ఎస్ఎస్సి 2007 పూర్వ సమతా పాఠశాల విద్యార్థులు చేయూతగా పలకలు బలపాలు పంపిణీ చేశారు. మంగళవారం మండలంలోని మర్రిగూడెం, చెవిటి తండా, రాంపురం పుల్లూరు గ్రామంలోని నాలుగు అంగన్వాడి కేంద్రాలలో అభ్యసించే పిల్లలకు పలకలు బలపాలను అందజేశారు. పూర్వ విద్యార్థి ఆర్, వి రాజేష్, రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులకు, ఆ,యా ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో



చదివిన నాటి పూర్వ విద్యార్థులు చేయూత ఇవ్వాలన్నారు. అంగన్వాడి కేంద్రాలలో అభ్యసించే చిన్నారులను బోధన సిబ్బంది కంటికి రెప్పలా కాపాడాలన్నారు. ఆటపాటలతో విద్యను అభ్యసింప చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఉపేంద్రమ్మ సునీత పార్వతి ఆయాలు రుక్మిణి, మర్రిగూడెం అంగన్వాడి టీచర్ స్వరూప అనసూర్య సీత, పుల్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంబాబు గ్రామస్తులు పూల్ సింగ్ భూక్య హరి రామ్ పున్నం శ్రీనివాస్ వెంకటేశ్వరరావు రాంపురం టీచర్ నిర్మల, అంగన్వాడి టీచర్ లక్ష్మి గ్రామస్తులు శ్రీను రోజా అనూష నవ్య ప్రవీణ్, పిల్లలు, పేరెంట్స్, నిర్వాహకులు పాల్గొన్నారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**